వాన పడిందంటే..నరకమే

- ఛే నంబర్ చౌరస్తాలో పరిస్థితి దారుణం
- ఫ్లైఓవర్ పనులతో మూసుకుపోయిన పాత నాలా
- నత్తనడకన వర్షపునీటి పైప్‌లైన్ పనులు
- రోడ్డుపైనే నిలుస్తున్న వరదనీరు...మురుగు
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న వాహనాలు...తప్పని ట్రాఫిక్ జామ్

వరదనీరు రోడ్డుపైకి రావడంతో ఛే నంబర్ చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

అంబర్‌పేట, సెప్టెంబర్ 25 : వాన పడితే చాలు అంబర్‌పేటలోని ఛే నంబర్ చౌరస్తాలో ప్రయాణికులు, వాహనదారులకు నరకం కనిపిస్తుంది. గంటలకొద్ది ట్రాఫిక్ జామ్‌తో పరేషాన్ పట్టుకుంటుంది. రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ఇటు నుంచి వెళ్లాలంటేనే వాహనదారులకు భయమేస్తోంది. ఇక్కడ ఒక పక్క ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండగా...మరోపక్క కొత్త వర్షపునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నవి. ఈ రెండు పనులతో జనాలు బేజారవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా పేరు చెబితేనే వాహనదారులు, జనాలు జంకుతున్నారు. ఇక్కడ జరుగుతున్న పనులు నత్తనడకన సాగుతుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. వాన పడిన రోజు మరింత ఇబ్బంది తప్పడం లేదు. ఛే నంబర్ నుంచి తిలక్‌నగర్ వైపు రోడ్డుపై భారీగా వరదనీరు చేరుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అక్కడ గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీనికి తోడు ఫ్లైఓవర్ నిర్మాణం పనుల వల్ల పాత నాలా పూర్తిగా మూసుకుపోయింది. దీంతో అందులో నుంచి వెళ్లే డ్రైనేజీ మురుగు చౌరస్తాలోనే ఆగిపోతుంది. రోడ్డుపైకి వస్తుంది. చౌరస్తా మొత్తం కుంటలా మారుతుంది. వాహనాలు వెళ్లడానికి లేకుండా ఉంటుంది. ఇది ప్రజలకు శాపంగా మారుతుంది.

అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

ఛే నంబర్‌లో తలెత్తే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై వరదనీరు, మురుగు నిలువకుండా చూడాలంటున్నారు. పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

స్టడీ టూర్‌లో భాగంగా..

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేటర్ల స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం మేఘాలయ రాష్ట్రం షిల్లాంగ్ మున్సిపాలిటీ అధికారులను గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతతో కలిసి అక్కడి అభివృద్ధిని అడిగి తెలుసుకుంటున్న అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తదితరులు.– గోల్నాక

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

వాహనదారులకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్

కాచిగూడ,సెప్టెంబర్ 25: వాహనదారులు ట్రాఫిక్ పోలీసులు సూచించిన ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం హెల్మెట్ వాడకం, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, త్రిబుల్ రైడింగ్‌లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ హెల్మెట్ వాడకపోతే జరిగే పరిణామాలను వాడడం వలన కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు.రోడ్లపై వాహనాలు నడిపేవారు పోలీసులు సూచించిన ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు జరుగవన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎ.బి బ్లాక్‌ల అధ్యక్షులు కూరాకుల కృష్ణ,కె.చంటి బాబు,నాయకులు ముంగి రఘుపాల్‌రెడ్డి,ఆకుల చంద్రశేఖర్,పరమానందం,గజరే కృష్ణ,సి.శంకర్,గిరి తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం

ప్రతిభకు క్రీడలు దోహదపడుతాయి

హెచ్‌డీఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొన్న డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి,సుమన్,చిరంజీవి, తదితరులు

కాచిగూడ,సెప్టెంబర్ 25: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను నిరూపించడానికి క్రీడలు దోహదపడుతాయని హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ ఈఓ ఎం.విజయలక్ష్మి అన్నారు. 68వ హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఇంటర్ హిమాయత్‌నగర్ జోనల్ లెవల్ స్కూల్ కబడ్డీ, ఖోఖో 25 నుంచి 27 వరకు నిర్వహించే టోర్నమెంట్ 2024–25 పోటీలు బుధవారం కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఈఓ ఎం.విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, తమ ప్రతిభను నిరూపించడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి, డాక్టర్ బి.లక్ష్మయ్య గంగపుత్ర, కళాశాల లెక్చరర్ వి.ప్రసాద్‌రావు,నిజామొద్దీన్,ఏఎంహెచ్ఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

కార్వాన్, సెప్టెంబర్ 28 : మన్నాన్ ఖాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న మాసబ్ ట్యాంక్‌లోని ఖాజా మెన్షన్ ఫంక్షన్‌హాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో పాటు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వర్క్ ఫ్రం హోం జాబ్ కూడా అందుబాటులో ఉన్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఆసక్తి గత అభ్యర్థులు వివరాలకు 8374315052లో సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న కనక పుష్యరాగం నాటకం

నాటకాన్ని ప్రదర్శిస్తున్న రసరంజని కళాకారులు

రవీంద్రభారతి,సెప్టెంబర్ 25: ప్రతి నెలా నాటకం–ప్రేక్షకుల వినోదం ,నటుడి ఆనందం కోసం రస రంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో దృశ్యవేదిక, విజయవాడ వారు బుధవారం రవీంద్రభారతిలో 'కనక పుష్యరాగం నాటకం ఘనంగా నిర్వహించారు. ఈ నాటకానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు(ఐఏఎస్)డాక్టర్ కేవి. రమణాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కనక పుష్యరాగం నాటికను ప్రారంభించారు.కనక పుష్యరాగం నాటకానికి రచన శ్రీరాఘవ, దర్శకత్వం యస్.కే మిశ్రో వహించారు. ఆరు దశాబ్దాల క్రితం ఎన్నో బహుమతులు పొందిన నాటక కనక పుష్యరాగం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రదర్శించారు. ఆ నాటకానికి స్వర్గీయ కె.వెంకటేశ్వర రావు దర్శకత్వం వహించగా,రాఘవ రచించారు.

పరిశీలన: సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ల సందర్శనలో భాగంగా బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి కూకట్‌పల్లి ఎస్టీపీని పరిశీలిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు –గోల్నాక

27న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్

రవీంద్రభారతి,సెప్టెంబర్ 25 : తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మానం ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు.బుధవారం దేశోద్ధారక భవన్‌లో డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫోరం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీజేఎస్ అధినేత ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీ.పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీలు ఈటల రాజేందర్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తదితరులు హాజరవుతారని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొంతం వీర స్వామి,బి. ఇంద్రకుమార్, విష్ణువర్ధన్, కో–ఆర్డినేటర్ నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాలు మెచ్చిన గాయకుడు రామాచారి

రామాచారికి పురస్కారాన్ని బహూకరిస్తున్న డాక్టర్ కేవి.రమణాచారి

రవీంద్రభారతి,సెప్టెంబర్ 25 : విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మెచ్చిన గాయకుడు రామాచారి అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు (ఐఏఎస్) డాక్టర్ కె.వి రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ,కిన్నెర కల్చరల్ ట్రస్ట్ నిర్వహణలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి సందర్భంగా కిన్నెర బాలు పురస్కారం రామాచారికి ప్రదాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కేవి.రమణాచారి విచ్చేసి రామాచారికి పురస్కారాన్ని బహూకరించారు.ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ లిటిల్ మ్యూజిక్ అకాడమీ స్థాపించి ఎందరో చిన్నారులకు సంగీత శిక్షణ ఇచ్చి బాలు ఈటీవీలో నిర్వహించిన పాడుతా తీయగా కార్యక్రమంలో అధిక శాతం విజేతలుగా నిలిపిన ఘనత రామాచారిదే అని అన్నారు.ఈ కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం, కిన్నెర రఘురాం,రాధాకృష్ణ, బోగరాజుమూర్తి పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం కోదండ రామ్

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 25: విద్యా అవకాశాలతో పాటు ఉపాధిని కల్పించాల్సిన భాధ్యత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం కోదండ రామ్ పేర్కొన్నారు.ఈ మేరకు కోటిలోని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలోని దర్బార్ హాల్‌లో ఊర్దూ డిపార్ట్‌మెంట్,నజీర్ అహ్మద్ మెమోరియల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టుల సంయుక్తాధ్వర్యంలో 7వ నిజం నవాబు ఉస్మానియా యూనివర్సిటీ వ్యవస్థాపకులు నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ బహదూర్ మెమోరియల్ లెక్చర్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యా అవకాశాలు అండ్ సమ్మిళిత ఉపాధి అనే అంశంపై సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యా అవకాశాలను మెరుగుపర్చడంతోనే ఉపాధి లభించదని,దానికి అనుగుణంగా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో నైపుణ్యతను పెంపొందిస్తేనే సాధ్యమవుతుందన్నారు.ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ లను అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం విజ్జులత,స్పెషల్ ఆఫీ సర్ ప్రొఫెసర్ సరస్వతమ్మ,తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి,ఇఫ్లూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రా జు నాయక్,ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ సయ్యదా నసీమ్ సుల్తానా,నజీర్ అహ్మద్ మెమోరియల్ అండ్ ఎడ్యుకేష నల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ మహమ్మద్ షోయబ్ అహ్మద్,టీఎంవీ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ హెచ్‌వోడీ డాక్టర్ రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో
యువత ముందుండాలి

బస్తీల్లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్

మెహిదీపట్నం, సెప్టెంబర్ 25 : ప్రజల సమస్యలు పరిష్కరించడంలో యువత ముందుండాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మెహిదీపట్నం,గుడిమల్కాపూర్‌లలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్‌కు చెందిన ఎంఐఎం పార్టీ యువ నాయకులు మహ్మద్ ఇబ్రహీం బస్తీలలో సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే యువత ప్రజల సమస్యలను పరిష్కరించడంలో స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజలకు డ్రైనేజీ సమస్యలు లేకుండా జీహెచ్ఎంసీ అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బుధవారం లంగర్‌హౌస్ డివిజన్ ప్రశాంత్‌నగర్ –1 కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిసి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు గడ్డి చందు పటేల్,కిషన్‌సింగ్, బలాల్,భుజంగరావులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం సెప్టెంబర్ 25

నోట్ పుస్తకాల పంపిణీ

తెలంగాణ ప్రగతి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజాంపేట్ ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను ప్రతినిధులు చెన్నయ్య ముదిరాజ్, భిక్షపతి అందజేశారు. –అబిడ్స్, సెప్టెంబర్25

ఫుట్‌పాత్ ఆక్రమణలను సహించం

లంగర్‌హౌస్ రింగ్‌రోడ్‌లో అక్రమంగా నిలిపిన వాహనాలను తొలగింపచేస్తున్న లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.అంజయ్య

మెహిదీపట్నం, సెప్టెంబర్ 25 :వాహనాలను ఫుట్‌పాత్‌లపై అక్రమంగా నిలిపి ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.అంజయ్య అన్నారు. బుధవారం లంగర్‌హౌస్ రింగ్‌రోడ్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా సర్వీస్‌రోడ్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించారు. అంతే కాకుండా వాహనాలను అక్రమంగా నిలిపి ఉంచితే ఎలాంటి హెచ్చరికలు లేకుండా వాహనాలను సీజ్ చేసి కోర్టు కేసులు వేస్తామని హెచ్చరించారు.

'తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీ రాములు పేరే ఉండాలి'

కార్వాన్, సెప్టెంబర్ 25: తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు సరైనదని ఆ పేరు మార్చడం భావ్యం కాదని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు ఒక ప్రాంతానికో, లేక ఒక సామాజిక వర్గానికో చెందినవాడు కాదని ఆయన గాంధీజీకి ప్రత్యక్ష శిష్యుడని గాంధీ సిద్ధాంతాలతో ప్రభావితుడై మద్రాస్ నగరం తెలుగు వారికే చెందాలని 58 రోజుల కఠోర దీక్ష చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అలాంటి వ్యక్తి పేరు తొలగించడం సమంజసం కాదన్నారు.

గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బుధవారం అక్టోబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న బహుజన బతుకమ్మ పోస్టర్‌ను అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సారథి విమలక్క పలువురు మహిళా సంఘాలతో కలిసి ఆవిష్కరించారు. స్త్రీలు గౌరవంగా జీవించే హక్కును ప్రజలలోకి బతుకమ్మ ఉత్సవాల ద్వారా తీసుకెళ్తామన్నారు. (తెలుగు యూనివర్సిటీ)

నేటి నుంచి మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న ఇండ్ల సర్వే

సైదాబాద్ తహసీల్దార్‌కు బాధ్యతలు ● మొదట రివర్‌బెడ్ ఇండ్ల గుర్తింపు

అంబర్‌పేట, సెప్టెంబర్ 25 : మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడిండి. ఇందులో భాగంగా మూసీ రివర్‌బెడ్(నదిగర్భం)లో ఉన్న ఇండ్ల సర్వే మొదలైంది. మూసీ నదిలో నిర్మాణాలను ముందుగా అధికారులు పరిశీలించనున్నారు. నివాసాలు, దుకాణాల అనుమతుల వివరాలు సేకరించనున్నారు. అంబర్‌పేట మండల పరిధిలో గల మూసీ నది రివర్‌బెడ్‌లో ఇండ్లను గుర్తించేందుకు సైదాబాద్ తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించారు. సైదాబాద్, ఆసీఫ్‌నగర్, అంబర్‌పేట ఈ మూడు మండలాల పరిధిలో ఉన్న మూసీ రివర్‌బెడ్‌లోని ఇండ్ల సర్వేను సైదాబాద్ తహసీల్దార్ చేపట్టనున్నారు. గురువారం ఉదయం నుంచి అంబర్‌పేటలో ఈ సర్వే మొదలు కానుంది. అంబర్‌పేట మండల పరిధిలో న్యూతులసీరాంనగర్(లంక), కమలానగర్, అంబేద్కర్‌నగర్, దుర్గానగర్ బస్తీలు ఉన్నాయి. అలాగే బాధితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తున్నారనే వివరాలు కూడా ఇవ్వనున్నారు.
అర్హులైన ప్రతి ఒక్క బాధితుడికి చట్ట ప్రకారం నష్టపరిహారం, పునరావాసం అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు.

కళాకారులకు సత్కారం: తెలంగాణ సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో వారం రోజులుగా కొనసాగుతున్న 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలలో భాగంగా బుధవారం సాయంత్రం ప్రముఖ నృత్య గురువులు డాక్టర్ సంజయ్ శాంతారామ్, శృతి ఎన్ మూర్తిల పర్యవేక్షణలో సాగిన సదస్సులో ఔత్సాహిక కళాకారులకు సంగీతం, నృత్య కళాంశాలపై సోదాహరణంగా వివరించారు. వక్తలు జి. వసుంధర, జయభాస్కర్‌లు సత్కరించారు. – తెలుగు యూనివర్సిటీ

'నాలా సమస్యలు పరిష్కరించాలి'

కార్వాన్, సెప్టెంబర్ 25 : వర్షం వచ్చినప్పుడల్లా కిషన్‌గంజ్ నాలా వల్ల సమస్యలు ఎదుర్కొనే ప్రజలు నాలా పై గతేడాది బ్రిడ్జి నిర్మించడంతో సమస్య తీరినట్లు భావించామని అయితే తిరిగి సమస్యలు వస్తున్నాయని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ విషయమై ఆయన జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి నాలా వద్ద సమస్యను అధికారులకు వివరించారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో మట్టిని సరిగ్గా తీయకపోవడం వల్ల వర్షపు నీళ్ళు దుకాణాలోకి వస్తున్నదన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో డీసీ విద్యానంద్, ఈఈ, డీఈ,ఏఈలతో పాటు స్థానికులు గోపాల్, దమ్ము, కౌశిక్, కట్టప్ప, చంద్రకాంత్, నందకుమార్, అనీల్ యాదవ్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుజాత వర్క్ ఆర్డర్ రద్దు

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 25: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానకు వర్క్ ఆర్డర్‌పై ఆగస్టులో వచ్చిన ప్రొఫెసర్ డాక్టర్ ఏ సుజాత ఆర్డర్‌ను రద్దు చేయడంతో మోడ్రన్ ప్రభుత్వ ప్రసూతి పేట్లబుర్జు దవాఖానకు తిరిగి వెళ్లారు.ఈ మేరకు బుధవారం ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో ప్రొఫెసర్ సుజాత సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన నుండి పేట్లబుర్జు మోడ్రన్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానకు వెళ్లా రు. దీంతో ప్రస్తుతం సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో ప్రొఫెసర్‌గా డాక్టర్ అనురాధ కొనసాగుతారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, సెప్టెంబర్ 25 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ ఝిన్సి బజార్ ఫీడర్,11 కేవీ రిసాల బజార్ ఫీడర్,11 కేవీ బీఎస్ఎన్ఎల్ ఫీడర్ లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఏటీసీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● మల్లేపల్లి ఐటీఐలో నాలుగు నూతన కోర్సులు ప్రారంభం

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాల దరఖాస్తుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు రాజా, సహాయ సంచాలకులు శ్రీధర్, ఐటీఐ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 25: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో శిక్షణ పొందాలనుకునే విద్యార్థులకు 5వ ఫేజ్‌లో భాగంగా ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఈ మేరకు బుధవారం విజయనగర్ కాలనీలోని మల్లేపల్లి ఐటీఐలో నూతనంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో ప్రవేశాల బ్రోచర్‌ను తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు రాజా, సహాయ సంచాలకులు శ్రీధర్, ఐటీఐ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి, టీవోలు కృష్ణాయాదవ్, శ్రీనివాస్, స్వప్న , తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐల్లో శిక్షణ పొందడానికి మిగిలిన సీట్ల భర్తీకి గాను ఏటీసీలో దరఖాస్తులు కోరుతున్నట్లు వివరించారు. కాగా మల్లేపల్లి ఐటీఐ ఏటీసీలో భాగంగా నాలుగు నూతన కోర్సులను ప్రారంభించినట్లు అన్నారు. మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ ఒక సంవత్సరం కోర్సులో 40 సీట్లు, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ ఒక సంవత్సరం కోర్సులో 40 సీట్లు, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ 1 సంవత్సరం కోర్సు 20 సీట్లు, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయ్యర్ రెండు సంవత్సరాల కోర్సులో 24 సీట్లు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 25 నుంచి 28వరకు అడ్మిషన్లు పొందాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు http//:iti.telangana.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బైక్ మాయం

కాచిగూడ,సెప్టెంబర్ 25: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఓ బైక్ మాయమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జి.సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాచిగూడ కబేళాకు చెందిన మహ్మద్ సద్దాం (22)విద్యార్థి. గత నెల 26న తన ఇంటి ముందు టీఎస్ 11 ఈఎక్స్ 3611 బైక్‌ను పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూసేసరికి తన బైక్ కనబడలేదు. చుట్టు పక్కల, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం మహ్మద్ సద్దాం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచారం నడిపిస్తున్న సూత్రధారుడిపై కేసు నమోదు

కాచిగూడ, సెప్టెంబర్ 25: ఓ ఇంట్లో వ్యభిచారం నడిపిస్తున్న సూత్రదారిపై కేసు నమోదు చేసి, అమ్మాయి, ఇద్దరు వ్యక్తులను కాచిగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాచిగూడలోని కుద్బిగూడకు చెందిన జి.శ్రీనివాసులు అమ్మాయిల సప్లయ్ వ్యక్తి రఫిక్ ఉల్ మల్లా సహకారంతో కొంత కాలంగా వివిధ రాష్ట్రాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారాన్ని నడిపిస్తూ, సొమ్ము చేసుకుంటున్నాడు.దీనిలో భాగంగా విటుడు కోటికి చెందిన సంతోశ్‌మిశ్రా (32)ను రప్పించుకుని కుద్బిగూడలోని ఓ ఇంట్లో కొన్ని రోజులుగా వ్యభిచారాన్ని నడిపిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అడ్మిన్ ఎస్సై డి.సుభాశ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీనివాసులు ఇంటిపై దాడిచేసి అమ్మాయి,ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ వ్యభిచారానికి ప్రధాన సూత్రదారుడు శ్రీనివాసులు, రఫిక్ ఉల్‌మల్లా, విటుడు సంతోశ్‌మిశ్రాను అదుపులోకి తీసుకుని,వారిపై కేసు నమోదు చేశారు.వారి వద్ద నుండి రూ.6,700 ,3 సెల్ ఫోన్‌లు,4 కండోమ్స్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కాచిగూడ అడ్మిన్ ఎస్సై తెలిపారు.

మధురై రైల్లో దొంగతనం

కాచిగూడ,సెప్టెంబర్ 25: మధురై రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి నగదు, సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని జల్‌గాన్ ప్రాంతానికి చెందిన ప్రభాకర్ వైదేకర్ భార్య రేఖా ప్రభాకర్ వైదేకర్(69)ఓకా–మధురై రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య పుణేలో బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న రూ.8వేల నగదు, ఖరీదైన సెల్‌ఫోన్‌ను దొంగిలించారు.బుధవారం రాత్రి కాచిగూడ రైల్వే పోలీసలకు ఫిర్యాదు చేసింది.
కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.